క్లుప్తంగా

సంచార జాతులను కాపాడాలి



నిజామాబాద్ నాగారం: సంచార జాతులను కాపాడాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ లాల్ అన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లోగల సంస్థ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. సంచార జాతులకు అన్ని రకాల సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందజేయాలన్నారు. వారిలో చైతన్యం తీసుకువచ్చి మంచి విద్య, వైద్యం అందించాలని కోరారు. తెరవే కామారెడ్డి అధ్యక్షులు గఫూర్ శిక్షక్, శివలింగం, వేముల శేఖర్ ఉన్నారు.

శివాజీ బీడీ సెంటర్ మార్చొద్దు

నిజామాబాద్ సిటీ: చందూరులోని శివాజీ బీడీ సెంటర్‌ను కుర్నాపల్లికి మార్చాలన్న నిర్ణయాన్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నూర్జహాన్ కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్ ఆర్ చౌరస్తాలోని శివాజీ బీడీ కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. చందూరుకు చెందిన మహిళ బీడీ ప్యాకర్స్ 14 సంవత్సరాలుగా పనులు చేస్తున్నారని తెలిపారు. వారి సర్వీసును దృష్టిలో పెట్టుకుని కుర్నాపల్లికి మార్చకుండా చందూరులోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. బీడీ ప్యాకర్లు రేఖ, విజయ, ఉష, భారతి, అనిత, జ్యోతి, అభిజ్ఞ పాల్గొన్నారు.

రేపు సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం

నిజామాబాద్ సిటీ: నగరంలో ఈనెల 30న సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. సమావేశానికి కార్మికులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లాకేంద్రంలోని నాందేవ్‌వాడలోగల పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాల్గొంటారని, పార్టీ అఖిల భారత మహాసభల్లో తీసుకున్న కర్తవ్యాల్లో భాగంగా జిల్లాలోని నాయకత్వానికి, కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ



జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎంఈవో శ్రీనివాస్ టై, బెల్టులను అందజేశారు. పాఠశాల విద్యార్థిని నిత్యశ్రీ జన్మదినం సందర్భంగా వారి తల్లిదండ్రులు సాంబార్ ఉమారాణి–నవీన్‌లు రూ.5వేల విలువగల టై, బెల్టులను వితరణ చేశారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై దృష్టిపెట్టాలి



సిరికొండ: మండలంలో మత్తు పదార్థాల సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్సై రామకృష్ణను కాంగ్రెస్ నాయకులు కోరారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సైని సోమవారం వారు కలిసి వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఎస్సైని శాలువాతో సన్మానించారు. చిన్న వాల్గోట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రొండ్ల గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్యాట్ల లింబాద్రి, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఆసిఫ్, జీవన్, దీప్‌చంద్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగ పంచమికి ముస్తాబైన ఆలయాలు

- నేడు నగరంలోని నాగేంద్రుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్న భక్తులు
- ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



నగరంలోని పోచమ్మ తల్లి ఆలయంలోగల నాగదేవుడి పుట్ట



నగరంలోని బోయిగల్లిలో విద్యుత్ దీపాలంకరణలో నాగేంద్రగుడి

నిజామాబాద్ రూరల్: నాగ పంచమి సందర్భంగా నగరంలోని నాగేంద్రుడి ఆలయాలు విద్యుత్ దీపాలంకరణలతో అందంగా ముస్తాబయ్యాయి. నేడు శ్రావణ శుద్ధ నాగపంచమి కావడంతో భక్తులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు.

ఎంతో ప్రత్యేకత..

నాగపంచమి పండుగ రోజున మహిళలు, చిన్నారులు కొత్త వస్త్రాలు ధరించి పుట్ట వద్ద పూజలు చేసి పాముల కోసం ఆవుపాలు పోయడం ఆనవాయితీగా వస్తోంది. నాగదేవతలకు పూజలు చేయడం ద్వారా సంతాన ప్రాప్తి, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్నది భక్తుల విశ్వాసం. నాగుల పంచమిని పురస్కరించుకుని జొన్న పేలాలకు భలే గిరాకీ ఏర్పడింది. ప్రత్యేకంగా తయారు చేసిన జొన్న పేలాలను నాగదేవతకు నైవేద్యంగా పెడతారు. తెల్ల జొన్నలను పేలాల తయారీకి ఉపయోగిస్తారు. ఈ పేలాలు కేవలం నాగుల పంచమి పండుగ సందర్భంగా విక్రయస్తారు. తర్వాత రోజుల్లో ఇవి మచ్చుకైనా కనబడవు. వంశపారంపర్యంగా ఇళ్లలోనే నాగదేవతను పూజించడం కొందరికి సంప్రదాయంగా ఉంది. నాగ దేవతలను మట్టితో తయారు చేసి నాగరూ పంలో ప్రతిష్ఠిస్తారు. ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించి, నాగ దేవతకు సారే సమర్పించుకుంటారు. అనంతరం సమీపంలోని పుట్ట వద్దకు వెళ్లి, పాలు పోసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆ పాలతో సోదరి, సోదరుడి కళ్లను కడుగుతారు. ఇలా కళ్లు కడగడం సోదర–సోదరీమణుల బంధానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుంది. నాగుల పంచమి రోజున చేసే ఉపవాసం సంవత్సరం పొడవునా వచ్చే నాగుల చవితి కంటే అధిక ఫలితం ఇస్తుంది అని భక్తులు విశ్వసిస్తారు. ఏదేమైనా నాగుల పంచమి సందర్భంగా నాగదేవత పూజలతో ఆలయాలు, పుట్టలు సందడిగా మారనున్నాయి.

నడిరోడ్డుపై గుంత.. వాహనదారులకు చింత

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి–నిజామాబాద్ ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. ఇటీవల నాలుగైదు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచి గుంతలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



నడిపల్లి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత



ఆర్యనగర్‌లోని రహదారిపై గుంతలు

నగరంలోని ఆర్యనగర్‌లో..

నిజామాబాద్ రూరల్: నగరంలోని ఆర్యనగర్‌లో రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో కాలనీ వాసులు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు గుంతల్లో చేరడంతో వాహనదారులు గుంతలను గమనించకుండ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ధర్పల్లిలో పందుల స్వైర విహారం

ధర్పల్లి: మండల కేంద్రంలో పందుల స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పందులను ఊరికి దూరంగా పెంచుకోవాలని నిబంధన ఉన్నప్పటికీ పెంపకం దారులు వాటిని గ్రామంలోనే పెంచుతున్నారు. మండల కేంద్రంలోని హోటల్స్, ఫాస్ట్ ఫుడ్, చికెన్ సెంటర్లు ఎక్కువగా ఉండడంతో వారు వ్యర్థాలను సమీపంలోని ఊర చెరువు కట్టపై పడేస్తున్నారు. పందులు వ్యర్థాల కోసం గ్రామంలో సంచరిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో ఎలాంటి వ్యాధులు వస్తాయోనని ధర్పల్లి వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఊర చెరువు కట్టపై సంచరిస్తున్న పందులు

ఇందూరును గ్రీన్‌సిటీగా తీర్చిదిద్దుతా

- పర్యావరణ పరిరక్షణ కోసమే వన మహోత్సవం
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ



మారుతినగర్‌లో మొక్కను నాటిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి తదితరులు

నిజామాబాద్ సిటీ: ఇందూరు నగరాన్ని గ్రీన్‌సిటీగా తీర్చిదిద్దుతామని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. జిల్లాకేంద్రంలోని గంగాస్థాన్ ఫేజ్–1 మారుతినగర్ పార్కులో సోమవారం ఆయన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ఈ ఏడాది 51 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నందున, లక్ష్య సాధనకు సమష్టిగా కృషిచేయాలన్నారు. పాఠశాల విద్యార్థులతో మొక్కలు నాటించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, పీసీసీ జనరల్ సెక్రెటరీ రాం భూపాల్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, ఇన్‌చార్జి డీఎఫ్‌వో నిఖిత, ఆర్డీవో రాజేంద్ర కుమార్, డీఎఫ్‌వో సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వండి

నిజామాబాద్ సిటీ/నిజామాబాద్ అర్బన్: తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారులు కోరారు. ఈమేరకు వారు సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీని కలిసి వినతిపత్రం సమర్పించారు. షబ్బీర్ అలీ స్పందిస్తూ.. రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారన్నారు. ఉద్యమంలో జైలు పాలైనవారికి ప్రభుత్వం ఇంటి స్థలాన్ని కేటాయించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

క్రీడారంగానికి నిధులు కేటాయించాలి

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ నాయకుడు సయ్యద్‌ఖైసర్ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన జిల్లాకేంద్రానికి వచ్చిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, మైనార్టీ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు.

మాలలకు రిజర్వేషన్లు పెంచాలి

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, 2024 జనాభాల లెక్కల ప్రకారం మాలలకు రిజర్వేషన్లు పెంచాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చొక్కం దేవిదాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు కోరారు. ఈమేరకు వారు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి విన్నవించారు. జిల్లా హెడ్ క్వార్టర్‌లో మాల కల్యాణ మండపానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. నాయకులు ఆనంపల్లి ఎల్లయ్య, నాంది వినయ్ కుమార్, రాజన్న, సంగం శ్రీనివాస్, ఆసది గంగాధర్, చంద్ర కాంత్, భూమయ్య, బొడ్డు లక్ష్మణ్, భూషణ్, సాయిలు, బాల స్వామి, రామ చందర్, సక్కి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు.. కాంగ్రెస్ నాయకుడు సయ్యద్‌ఖైసర్



మాలమహానాడు ఆధ్వర్యంలో..

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో తాత్కాలిక పద్ధతిలో ఖాళీగా ఉన్న మహిళా అధ్యాపక పోస్టును భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేక అధికారిణి సవిత ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్ ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించడానికి అభ్యర్థులు తప్పనిసరిగా బీఈడీతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను మంగళవారం లోపు కేజీబీవీలో అందజేయాలని తెలిపారు.

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేక అధికారిణి వర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో సివిక్స్ బోధించుటకు ఎంఏ పొలిటిక్స్‌తో పాటు పీజీ బీఈడీ పూర్తి చేసిన వారు, హైస్కూల్లో సోషల్ సబ్జెక్టు బోధించుటకు పీజీ బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రెండు రోజుల్లో ఇందల్వాయి కేజీబీవీలో దరఖాస్తులు అందజేయాలని ఆమె తెలిపారు.

ఆధ్యాత్మికం

వైభవంగా మహా గణపతి ఆలయ వార్షికోత్సవం



నిజామాబాద్ రూరల్: నగరంలోని బొడ్డెమ్మ చెరువు పక్కన గల మహాగణపతి ఆలయం 13వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకులు సంజయ్‌శర్మ, అధ్యక్షుడు చిలుముల భూషన్‌చారి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నగరేశ్వరాలయంలో శ్రావణమాస పూజలు



నిజామాబాద్ రూరల్: శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా స్థానిక నగరేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్న పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. నగరేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు వివేకానంద్, ప్రధాన కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

నగరంలోని శైవక్షేత్రాల్లో..

నిజామాబాద్ రూరల్: నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభుని గుడిలో భక్తులు శ్రావణమాసం మొదటి సోమవారం కావడంతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు ఉపవాసాలు చేస్తూ వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పలు ఆలయాల్లో అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి కుంకుమార్చనలు నిర్వహించారు.

లొంక రామలింగేశ్వరాలయంలో..



సిరికొండ: మండలంలోని లొంక రామలింగేశ్వరాలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. పురోహితులు దండాల నాగరాజుశర్మ సైకత లింగంకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో సిరికొండ వీడీసీ ఆధ్వర్యంలో కోనేరు పైనగల రాముల వారి పాదాల వద్ద పూజల అనంతరం వరద పాయసం పోయగా భక్తులు సేవించారు. ఆలయ కమిటీ సభ్యులు బడాల సంతోష్, మంగళి గంగాధర్, దాసరి మారుతి, వీడీసీ చైర్మన్ స్వామి, మంగళి మోహన్, రమేష్, లక్ష్మణ్, గంగాధర్ పాల్గొన్నారు.



వరద పాయసం స్వీకరిస్తున్న భక్తులు

నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్

రుద్రూర్: నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంలో సోమవారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని వాహనాలు సీజ్ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు తీసుకువస్తే వాహనాలను విడుదల చేస్తామన్నారు. ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానాస్పదంగా కన్పించినా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోధన్ సీఐలు విజయ్ బాబు, వెంకటనారాయణ, రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి, రుద్రూర్, వర్ని ఎస్సైలు సునీల్, సాయన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

సైబర్ నేరాలపై అవగాహన

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం స్థానిక పోలీస్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో వినోద, హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్ నాగారం: గర్భిణులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ అన్నారు. నగరరంలోని దుబ్బ జిల్లా పరిషత్ స్కూల్‌లో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ఆమె గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్, బ్లౌజ్ పీస్, ప్రొటీన్ పౌడర్, పళ్ళు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతి నెల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య పరీక్షలు, మందులపై అవగాహన కల్పించారు. అధ్యక్షుడు పాకాల నరసింహారావు, కార్యదర్శి గంజి రమేష్, ట్రెజరర్ పాల్తి రక్షిత్ కుమార్, స్వాతి ఠాకూర్, రంజిత్ సింగ్ ఠాకూర్, బంగారి వీరబ్రహ్మం, రాచకొండ గౌరీ శంకర్, నాలం గిరీష్ కుమార్, గైనకాలజిస్ట్ అరుణ తదితరులు పాల్గొన్నారు .

పర్యావరణాన్ని కాపాడాలి

నిజామాబాద్ రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణంను కాపాడాలని లయన్స్ క్లబ్ పోర్ట్ సిటీ అధ్యక్షుడు అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. మాధవ నగర్ రామాలయం వద్ద సోమవారం లయన్స్ క్లబ్ పోర్ట్ సిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్య రహిత దేశం నిర్మాణం కోసం సంకల్పం చేపట్టాలన్నారు. శివరామకృష్ణ, రాఘవేంద్రరావు, మైలారం నారాయణరెడ్డి, నరసింహాచారి, పొందూరి చిలుకమ్మ, లక్ష్మీ నర్సయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు .



మాధవనగర్‌లో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	99,500	వెండి(కిలో)	1,19,500
22 క్యారెట్స్	91,852	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	60	గాజరుగడ్డ	35	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	50	90
బీరకాయ	25	50	దోసకాయ	15	30
దొండకాయ	15	30	ఆలుగడ్డ	25	50
బజ్జీసకాయ	70	100	గోబిగడ్డ	20	40
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	60
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	25	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	90	చామగడ్డ	30	60
కొత్తిమీర	35	60	చిక్కుడుకాయ	35	60
పుదీనా	40	80	గోరుచిక్కుడు	35	60
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

సంక్షిప్తం

ఆలయ చైర్మన్లకు సన్మానం



నిజామాబాద్ రూరల్: నగరంలోని జెండా బాలాజీ మందిర్ చైర్మన్‌గా ఎన్నికైన లవంగ ప్రమోద్, హమాల్‌వాడి సంతోషి మాత, సాయిబాబా మందిరం చైర్మన్‌గా ఎన్నికైన బోధకం గంగా కిషన్‌లను సోమవారం రావూజీ సంఘం కన్వీనర్ నరేష్‌కుమార్, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో అడ్మిషన్లపై సమీక్ష

బోధన్: ఈవిద్యాసంవత్సరానికిగాను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించిన అంశంపై సోమవారం తన చాంబర్‌లో సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బోధన్, ఎడపల్లి, నవీపేట, రెంజల్ మండలాల ఎంపీడీవోలు, ఎంఈవోలు, హాస్టళ్ల వార్డెన్‌లు హాజరయ్యారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అడ్మిషన్ల ప్రక్రియను పాదర్శకంగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ సూచించారు. వసతి గృహాల విద్యార్థుల భద్రతపైశ్రద్ధ వహించాలని తెలిపారు. తమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను వార్డెన్‌లు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

వేల్పూర్: మండలంలోని రామన్నపేట్ గ్రామంలో సోమవారం బేల్దారి నవీన్‌కు రూ. 17500, గూండ్లకిషన్‌కు రూ. 17వేలు, చాకలి జలంకు రూ. 44 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. శోభన్‌రెడ్డి, మోహన్, ఎల్క శ్రీనివాస్, భూమేశ్వర్‌రెడ్డి, లింబాద్రి, తెడ్డు భూమేశ్వర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11, 12,13, 30, 31, 32, 33వ వార్డుల్లో వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ నిర్మాణాలను కమిటీ సభ్యులతో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోలా వెంకటేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 5లక్షలతో సొంత ఇళ్లు నిర్మించుకోటానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 618 మందికి ఇళ్లు మంజూరు కాగా, అందులో సుమారు 50% కి పైగా లబ్ధిదారులు ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నాని పేర్కొన్నారు. నాయకులు తాటి హన్మాండ్లు, లోక రాజేశ్వర్, పులి గంగాధర్, మీసాల రవి, బట్టు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈత మొక్కలు నాటిన గీత కార్మికులు

వేల్పూర్: మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఈత వనం కోసం గీతకార్మికులు సోమవారం ఈజీఎస్ తరపున అందజేసిన ఈత మొక్కలను వారి సొసైటీ స్థలంలో నాటారు. అర ఎకరం స్థలంలో సుమారు 870 ఈత మొక్కలు నాటారు. వీటిని పెంపుదల చేసుకొని ఉపాధి పొందుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు పోశగౌడ్, వెంకాగౌడ్, శ్రీనివాస్, ముత్తెన్న,రాజేశ్వర్ పాల్గొన్నారు.